RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

దిన పత్రిక

మనకు లభించే చిన్న
అవకాశాలే భవిష్యత్తులో
ఉన్నత శిఖరాల్ని
చేరుస్తాయి
– బెంజమిన్ ఫ్రాంక్లిన్

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 251
బుధవారం, ఆగస్టు 26, 2026 , పేజీలు - 4 వెల : 2/-

# కేంద్ర కేబినెట్‌లో భారీ ప్రక్షాళన

## కొత్త మంత్రులు ఎవరు వీరికి ఉద్వాసన తప్పదా?



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** కేంద్ర మంత్రివర్గంలో భారీ మార్పులకు రంగం సిద్ధమవుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే ఈ మార్పులు, చేర్పులు ఉంటాయని భావించినా ప్రధాని మోడీ బీజీ షెడ్యూల్ కారణంగా సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో త్వరలో కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ప్రధాని మోడీ జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ముఖ్యంగా యువత, ప్రాంతీయ సమతౌల్యత, అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లభించనున్నట్లు తెలుస్తోంది.బీజేపీ ఇప్పటికే జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. ఇందులో హర్ష్ మల్హోత్రా, పంకజ్ చౌదరి వంటి వారిని ఢిల్లీ, యూపీ రాష్ట్ర శాఖలకు అధ్యక్షులుగా నియమించారు. అలాగే సీనియర్ మంత్రి పీయూష్ గోయల్ ను సైతం బీజేపీ కోశాధికారిగా నియమించారు. దీంతో ఈ మంత్రుల స్థానాలు ఖాళీ అయినట్లేనని భావిస్తున్నారు. వీరు కాకుండా ఇప్పటికే రాజ్యసభ పదవీకాలం ముగిసిన జార్జి కురియన్, రవ్ నీత్ సింగ్ బిట్టూలు మంత్రి పదవులకు రాజీనామా చేశారు. ఈ నవంబర్ లో పెట్రోలియం మంత్రి హర్దీప్ పూరీ పదవీకాలం కూడా ముగియనుంది. దీంతో ఆయన్నూ తప్పించే అవకాశం ఉంది. ఇలా కేబినెట్లో 12 ఖాళీలు రాబోతున్నాయి. దీంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, 2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ విస్తరణ జరగనుంది. ఈసారి కేబినెట్ విస్తరణలో యువతకు, మహిళలకు మరింత ప్రాధాన్యత లభించవచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో ఏపీకి చెందిన రామ్మోహన్ నాయుడు అత్యంత పిన్న వయస్కుడైన మంత్రిగా కొనసాగుతున్నారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, పశ్చిమ బెంగాల్ వంటి కీలక రాష్ట్రాల్లో పార్టీ పునాదిని పటిష్టం చేసుకునేందుకు ఆయా రాష్ట్రాల నేతలకు ప్రాతినిధ్యం లభిం చనుంది. మహారాష్ట్ర నుంచి శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండేను తీసుకోనున్నారు. ప్రస్తుతం అమిత్ షా, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, అశ్విని వైష్ణవ్, కిషన్ రెడ్డి వంటి దాదాపు 14 మంది కీలక మంత్రులు ఒకటి కంటే ఎక్కువ శాఖల బాధ్యతలను మోస్తున్నారు. ఈ భారాన్ని తగ్గించేందుకు కొన్ని శాఖలను కొత్తగా చేరే వారికి బదిలీ చేసే అవకాశం ఉంది.

## మూసీ ప్రాజెక్ట్ భూసేకరణను
# వేగవంతం చేయండి..

– సీఎం రేవంత్ ఆదేశాలు



**హైదరాబాద్, ఆగస్టు 25:** మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహి ంచారు. మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశిం చారు. ల్యాండ్ పూలింగ్‌పైన స్పష్టమైన విధానం రూపొందించుకోవాలన్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత త్వరగా టెండర్‌లను పిలవాలని ఆదేశించారు.ప్రాజెక్ట్‌లకు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్‌లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని ఆదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. ఈరోజు(మంగళవారం)బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షా సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, కమిషనర్ సర్ఫరాజ్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదు..
# విదేశీ విద్యంటే నమ్మేదెలా

: బండి సంజయ్



**హైదరాబాద్, ఆగస్టు 25:** కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదని.. విదేశీ విద్యను అందిస్తానంటే నమ్మేదెలా అని ప్రశ్నించారు. ఫీజు బకా యిలు అందక ఉన్న కాలేజీలే మూత పడుతున్నాయని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రప్పిస్తాననడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. లక్షలాది మంది విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభ సీఎంకు పట్టదా అని నిలదీశారు.'సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యాలు.. విద్యార్థులకు చేస్తున్న అవమానాలు కనిపించడం లేదా? ఫీజు బకాయిలు అడిగితే కాలేజీ యాజమాన్యాలను బెదరి ంచడం తప్ప కాంగ్రెస్ సర్కార్ సాధించిందేమిటి? ఫీజు రీయింబర్స్ బకాయిల వల్ల దళిత, గిరి జన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నా పట్టదా? ఇందిరమ్మ రాజ్య మంటే దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నత విద్యకు దూరం చేయడమేనా? వన్ టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది?' కురిపించారు.

## యూఎస్ పర్యటనపై సీఎం రేవంత్
# క్లారిటీ ఇవ్వాలి

: కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణా లతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు. అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగి నట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు. ఇది సాధారణ ప్రక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు.

## వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత
# గడువులో పూర్తి చేయాలి

: మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఆగస్టు 25 :** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈరోజు (మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు ఇచ్చిన టార్గెట్‌లో 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు.ప్రతి మొక్కను సంరక్షించాలి..మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంర క్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచిం చారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యా ర్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు.

## రైతుల భూములు రైతులకే
# పల్లెల్లో పండుగ వాతావరణం



**తమిళ్‌నాడు :** కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన ప్రతిపాదిత పరందూర్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ విషయంలో విజయ్ తుది నిర్ణయం తీసుకు న్నారు. పరందూర్‌లో నూతన విమానాశ్రయం నిర్మించాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తోన్నామని తేల్చి చెప్పారు. ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తే వందల హెక్టార్లల్లో పంట నష్టపోవాల్సి ఉంటు ందని, స్థానికులను ఖాళీ చేయించి, వారికి ఇబ్బందులకు గురిచేసే ఎలాంటి అభివృద్ధి ప్రాజెక్టులను ప్రోత్సహించబోమని స్పష్టం చేశారు.చెన్నై సమీపంలో నూతన విమానాశ్రయం నిర్మాణానికి వ్యవసాయేతర ప్రాంతాలను పరిశీలిస్తున్నామని, ఇందుకోసం ఇప్పటికే కొన్ని ప్రదేశాలను కూడా ప్రాథమికంగా గుర్తించామని విజయ్ వివరించారు. చెన్నై మీనంబాక్కం ఎయిర్ పోర్ట్ లో కొత్తగా అయిదో టెర్మినల్ నిర్మాణానికి త్వరలో చర్యలు చేపడతామని అన్నారు. దీనివల్ల రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవనీ, వారి భూములు వారికే చెందుతాయని అన్నారు.పరందూర్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్‌ను నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయంపై స్థానికులు, ఆందోళన కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తోన్నారు.

# ట్రంప్ ప్రభుత్వం భారీ షాక్..
## వీసా ఫీజు పెంచుతూ ప్రతిపాదనలు..



**వాషింగ్టన్:** అమెరికాలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న విదేశీ నిపుణులకు ట్రంప్ ప్రభుత్వం మరోసారి భారీ షాక్ ఇచ్చింది. కొత్తగా జారీ చేసే ఎ-1బీ వీసాలపై 1,03,265 డాలర్ల (సుమారు రూ.86 లక్షలు) ఫీజు విధించే ప్రతిపాదనను సోమవారం ప్రకటించింది. ఈ నిర్ణయం ముఖ్యంగా భారతీయ ఐటీ నిపుణులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎ-1బీ వీసాదారుల్లో భారతీయులే అత్యధికంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రతిపాదనపై ఆసక్తి నెలకొంది.కొత్త ఎ-1బీ వీసాలకు 1,03,265 డాలర్ల ఫీజు విధించాలని అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదించింది. తాజా ప్రతిపాదనపై 30 రోజులపాటు ప్రజల నుంచి అభిప్రాయాలను స్వీకరించనున్నారు. అనంతరం నిబంధనను ఖరారు చేసే అవకాశం ఉంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ ఏడాది చివరి నాటికి కొత్త ఫీజు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. గతేడాది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లక్ష డాలర్ల ఫీజును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే, ఆ నిర్ణయాన్ని ఫెడరల్ కోర్టు అడ్డుకోవడంతో ప్రస్తుతం న్యాయపరమైన వివాదం కొనసాగుతోంది.భారతీయులపైనే ఎక్కువ ప్రభావం..అమెరికా కంపెనీలు టెక్నాలజీ, ఇంజినీరింగ్, విద్య, పరిశోధన వంటి ప్రత్యేక నైపు ణ్యాలు అవసరమైన ఉద్యోగాల్లోకి విదేశీ నిపుణులను తీసుకునేందుకు వీసాలను ఉపయోగిస్తాయి. ఏటా 65 వేల సాధారణ ఉంటాయి.

## ఏపీ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల
# చుట్టూ తిరగాల్సిన పనిలేదు..



**అమరావతి :** ఏపీ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు.. సీఎం చంద్రబాబు కీలక ప్రకటన
ఏపీ ప్రజలకు ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబం ధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయా లన్నారు. ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ఆరా తీశారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రభుత్వ కార్యా లయాలకు వెళ్లే పనిలేకుండా ఆన్‌లైన్ సేవలు సులభతరం చేయా లని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. దీని కోసం ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్‌చైన్ వంటి సాంకే తికతలను వినియోగించుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. ప్రజలు ఇకపై ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సేవలు అందించాలన్నారు. సీఎం చంద్రబాబు అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల పనితీరు, పురోగతిపై సమీక్ష చేశారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1204 సేవలు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.. ఈ సేవలకు సంబంధించిన డేటా ఎంట్రీ సమాచారాన్ని సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేయకుండా డేటా ఇంటిగ్రేషన్ చేయాలని సూచించారు .రాష్ట్రవ్యాప్తంగా సాగులో ఉన్న పంటలకు అవసరమైన నీళ్లు అందేలా చూడాలని.. ప్రజలకు తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు చంద్రబాబు. ఇంకా చాలామంది రైతులు వ్యవసాయం మొదలుపెట్టలేదని.. అలాంటి చోట్ల వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు. రైతుల కోసం ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్స్ మెసేజ్‌లుపంపాలని సూచించారు. అధికారులు క్రాప్ అలర్ట్స్‌పై తీసుకునే చర్యల్ని పర్యవేక్షించాలన్నారు. సెప్టెంబరు నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు అందించగలమని
ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

# రోప్ స్కిప్పింగ్ పోటీల్లో 'శ్రీనిధి గ్లోబల్ స్కూల్' విద్యార్థుల ప్రతిభ

**- రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికైన ఇద్దరు విద్యార్థులు**
**- సంజనకు స్వర్ణం, వీన్సీ కు రజత పతకం**






అమీన్‌పూర్, ఆగస్టు 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ డివిజన్ పరిధిలో శ్రీనిధి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి తమ సత్తా చాటారు. ఈ నెల 23న అల్వాన్‌గూడలోని ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో తెలంగాణ స్టేట్ రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో శ్రీనిధి గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–12 స్పీడ్ స్ప్రింట్ విభాగంలో: సంజన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం (గోల్డ్ మెడల్) సాధించి నేషనల్స్ పోటీలకు ఎంపికైంది. అండర్–12 విభాగంలో: వీన్సీ అద్భుత నైపుణ్యంతో రజత పతకం (సిల్వర్ మెడల్) కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ నల్లపాటి వెంకటేశ్వరరావు గారు, ప్రెసిడెంట్ నల్లపాటి రాజేశ్వరి గారు, ప్రిన్సిపాల్ తుమ్మల శ్రీదేవి గారు మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అందిస్తున్న ప్రోత్సాహానికి ఈ ఫలితాలే నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే జాతీయ స్థాయి పోటీలలో కూడా పాల్గొని రాష్ట్రానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# క్షయ నివారణకు సమన్వయంతో కృషి చేయాలి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. లలితా దేవి






సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనకు సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ కె. లలితా దేవి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మధ్యస్థ స్థాయి ఆరోగ్య సేవా ప్రదాతలు (ఎం.ఎల్.హెచ్.పి), సమాచార నమోదు నిర్వాహకులకు (డేటా ఎంట్రీ ఆపరేటర్లు) క్షయ నియంత్రణ చర్యలు, వ్యాధి ముందస్తు గుర్తింపు, చికిత్సా విధానాలు మరియు సకాలంలో నివేదికలు పంపే అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో క్షయ లక్షణాలు ఉన్నవారిని త్వరగా గుర్తించి, వెంటనే వైద్య పరీక్షలకు పంపించాలని సూచించారు. చికిత్స పొందుతున్న రోగుల వివరాలను సక్రమంగా ఎప్పటికప్పుడు 'ని-క్షయ్' అంతర్జాల వేదిక (వెబ్‌సైట్)లో నమోదు చేయాలన్నారు. కేసుల వివరాలను నిర్దేశిత గడువులోగా నమోదు చేసి, నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించాలని స్పష్టం చేశారు. బాధితులకు మెరుగైన సేవలందించి జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎంఎస్ చేగుంటలో ఘనంగా ఇన్వెస్టిచర్ కార్యక్రమం






చేగుంట ఆగస్టు 25 మెదక్ టుడే న్యూస్

చేగుంట టీజీఎంఎస్ పాఠశాలలో నేడు ఇన్వెస్టిచర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన విద్యార్థి నాయకులకు అధికారికంగా హోదాలు, బ్యాడ్జీలు అందజేసి వారి బాధ్యతలను అప్పగించారు. విద్యార్థి నాయకత్వ పదవుల ద్వారా క్రమశిక్షణ, బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. నూతన నాయకత్వ బాధ్యతల స్వీకరణ విద్యార్థుల్లో గర్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు పాఠశాల అభివృద్ధిలో బాధ్యతాయుతంగా భాగస్వాములు కావడానికి దోహదపడు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భాజపా సంగారెడ్డి జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్‌గా కొండ లక్ష్మణ్ గుప్తా నియామకం

**-- పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు**



పటాన్‌చెరు, ఆగస్టు 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్‌గా పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన కొండ లక్ష్మణ్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అధికారిక నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కొండ లక్ష్మణ్ గుప్తా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పటాన్‌చెరు నుంచి జిల్లా స్థాయి కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, శాసనమండలి సభ్యులు అంజిరెడ్డిలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు సహకరించిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదెల్లి రవీందర్, రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్కూరి రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పటాన్‌చెరు నియోజ కవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి, వ్యాపార--వాణిజ్య వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. కొండ లక్ష్మణ్ గుప్తా నియామకం పట్ల స్థానిక పార్టీ శ్రేణులు, వాణిజ్య వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

# లోవోల్టేజీ సమస్యపై విద్యుత్ ఏఈకి వినతి



చేగుంట ఆగస్టు 25 మెదక్ టుడే న్యూస్

చేగుంట పట్టణంలోని 14వ వార్డు, 12వ వార్డులలో లోవోల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. లోవోల్టేజీ కారణంగా విలువైన విద్యుత్ పరికరాలు పాడవుతున్నాయని, ఇళ్లలోని బోరు మోటార్లు నడవడం లేదని తెలిపారు. అంతేకాకుండా కరెంటు స్తంభాలపై వైర్లు లూజుగా ఉండటం, స్తంభానికి స్తంభానికి దూరం ఎక్కువగా ఉండటంతో వైర్లు ఒకదానికొకటి అల్లుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. 14వ వార్డు సుఖేందర్, 12వ వార్డు ఉదయ్ రాజు, తుమ్మ యాదగిరి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

# రాణి--శివ వివాహానికి జడ్జి ప్రభాకర్‌కు ఆహ్వానం

**- సీఎం సమావేశంలో ఉన్నందున స్వయంగా రాలేకపోతున్నా.. తప్పక**
**- వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**- జడ్జి ప్రభాకర్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేసిన పులిమామిడి శ్రీశైలం గౌడ్**



( స్పెషల్ కరస్పాండెంట్) హైదరాబాద్,ఆగస్టు,25, మెదక్ టుడే న్యూస్:

షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మేనకోడలు రాణి--శివల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ నాంపల్లి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి గుబ్బ ప్రభాకర్‌కు వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తరపున మాజీ కౌన్సిలర్ పులిమామిడి శ్రీశైలం గౌడ్ జడ్జి ప్రభాకర్‌ను కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జడ్జి ప్రభాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ముఖ్యమంత్రి సమావేశం నిమిత్తం సెక్రటేరియట్‌లో ఉన్నందున తాను స్వయంగా వచ్చి ఆహ్వానించలేకపోతున్నా నని, తన కార్యకర్త పులిమామిడి శ్రీశైలం గౌడ్ ద్వారా వివాహ పత్రిక పంపిస్తున్నానని తెలిపారు. రాణి--శివల వివాహానికి తప్పక హాజరై వధూవరులను ఆశీర్వదించాలని జడ్జి ప్రభాకర్‌ను ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేకంగా కోరారు. వివాహ ఆహ్వాన పత్రిక అందజేసిన కార్యక్రమంలో సామాజికవేత్త, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు జడ్జి గుబ్బ ప్రభాకర్‌కు సమీప మిత్రుడిగా, శ్రేయోభిలాషిగా వ్యవహరిస్తున్న డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొని ఆత్మీయతను చాటుకున్నారు. వివాహ వేడుకకు ఆహ్వానం అందుకున్న జడ్జి ప్రభాకర్ సానుకూలంగా స్పందించి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీ శ్రీ శ్రీ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ సతీష్‌కు ఘన సన్మానం




చేగుంట, ఆగస్టు 25 మెదక్ టుడే న్యూస్

చేగుంట మండల కేంద్రంలోని శ్రీ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన సంద్రుగు సతీష్‌ను చేగుంట ప్రెస్ మీడియా ప్రతినిధులుమర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంద్రుగు సతీష్‌కు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నూతన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేయాలని మీడియా ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేగుంటకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు స్టాలిన్ నరసింహులు , సోమ ప్రవీణ్, నాగార్జున, రవీ, చౌదరి శ్రీను, మహేష్, వార్డు మెంబర్ సుఖేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 27న జరిగే ధర్నాను విజయవంతం చేయండి: టి ఈ జె ఎ సి



చేగుంట ఆగస్టు 25 మెదక్ టుడే న్యూస్

చేగుంట ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మొండి వైఖరిని అవలంభిస్తోందని టీ ఈ జె ఏ సి నాయకులు ఆరోపించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని, పెండింగ్ లో ఉన్న పీఆర్సీని, 6 డీఏలను వెంటనే ప్రకటించాలని, ఈహెచ్ఎస్ లో ఉన్న లోపాలను సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న జిల్లా కేంద్రంలో టీ ఈ జె ఏ సి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి మండలంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చేగుంట ఎమ్మార్వో బాలలక్ష్మి, ఎంపీడీఓ సిబ్బంది విజయ్, టీఆర్టీఎఫ్ అధ్యక్షులు జగన్ లాల్, యూటీఎఫ్ అధ్యక్షులు బాల పోచయ్య, ఎస్టీయూ అధ్యక్షులు పెంటా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వడియారంలో ఘనంగా వన మహోత్సవం



**చేగుంట ఆగస్టు 25 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం వడియారం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా చేగుంట మండలంలోని వడియారం జిల్లా పరిషత్ హై స్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు వడియారం సర్పంచ్ సాయి గౌడ్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

## చేగుంటలో ఘనంగా కరణం గణేష్ రవికుమార్ పుట్టినరోజు వేడుకలు



**చేగుంట, ఆగస్టు 25 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల కేంద్రంలో పత్రిక విలేకరి, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కరణం గణేష్ రవికుమార్ పుట్టినరోజు వేడుకలను మిత్రులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో కేక్ కట్ చేయించి, శాలువా కప్పి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమాజ హితం కోసం, యోగా వ్యాప్తికి నిరంతరం కృషి చేస్తున్న ఆయన ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజనకు రామచంద్రం, సంజీవులు, చాట్ల సంతోష్ కుమార్, నర్సింలు, లింగమూర్తి, నాగరాజు, బ్రహ్మం, పెంటాగౌడ్, గోలి మహేష్, మనోహర్, ప్రశాంత్, అలీ, నరేష్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేద్దాం :

**- ఉప సర్పంచ్ అబ్దుల్ ఆబిద్**




**రాజాపేట ఆగస్టు 25**

ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక మొక్కను నాటి సంరక్షించి భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేద్దామని రాజాపేట మండలం బొందుగుల గ్రామ సర్పంచి అబ్దుల్ అబిద్ కోరారు. మంగళవారం బొందుగుల గ్రామంలో వనమోహత్సవ కార్యక్రమం భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబ్దుల్ అబిద్, కార్యదర్శి శ్రీనివాసులు, ఫీల్డ్ ఆఫీసర్ మల్లేశం, వార్డ్ సభ్యులు శీను, వెంకటేష్, శ్రీధర్ గ్రామస్తులు సిద్ధులు, కిషన్, అశోక్ లు పాల్గొన్నారు.

## నమిలలో విక్రయానికి నకిలీ సర్టిఫికెట్లు

**రాజాపేట ఆగస్టు 25 (**

రాజాపేట మండలం నమిల గ్రామ పంచాయతీ లో విక్రయానికి లెక్కలు సర్టిఫికెట్లు పుట్టుకొస్తున్నాయి. గతంలో సెక్రటరీగా పని చేసిన నవీన్ ప్రస్తుతం కూడా తప్పుడు సర్టిఫికెట్లను ఇస్తున్నాడు. 22 అక్టోబర్ 2019 సంవత్సరంలో నమిల గ్రామంలో సరోజ అనే వ్యక్తి మృతి చెందినట్లు రిజిస్ట్రేషన్ కూడా అయినట్లు ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. కాగా సదర వ్యక్తి నిజామాబాద్ లో మరణించినట్లు స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో ఇండ్ల స్థలాలు కూడా ఆస్తి మార్పిడి చేసి దర్జాగా డబ్బులు సంపాదించినట్లు సెక్రటరీ నవీన్ పై ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఇండ్ల స్థలాలు లేని వారికి కూడా ఇళ్ల స్థలాలు ఉన్నట్లు పత్రాలు సృష్టించి గ్రామంలో అశాంతికి


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
Government of Telangana State
CERTIFICATE OF DEATH
4. మరణించిన తేది : 22/10/2019
6. రిజిస్ట్రేషన్ నెంబరు : 17/2020
7. రిజిస్ట్రేషన్ తేది : 09/11/2020
తేది 09/11/2020
Date
Panchayath Secretary
G.P. Nemila, Mdl. Rajapet,
Dt. Yadadri Bhongir.

గొడవలకు సదరు నవీను కారకుడయ్యాడు. ఈ విషయాన్ని ఎంపీడీవో, ఎంపీవో ల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అయినప్పటికీ ఎలాంటి విచారణలు నిర్ణయాలు చర్యలు లేకపోవడం పట్ల మరిన్ని తప్పుడు ధృవీకరణ పత్రాలు మోసాలు జరిగే పరిస్థితులు ఉన్నాయి.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం:
# పటేల్‌గూడలో అదనపు అంతస్తుల కూల్చివేత!

**- నోటీసులు ఇచ్చినా, సీజ్ చేసినా బేఖాతరు చేసిన బిల్డర్లు**

**- అనుమతులు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు తప్పవు: అమీన్‌పూర్ ఏసీపీ ప్రసాద్ వార్నింగ్**







**అమీన్‌పూర్, ఆగస్టు 25: (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

అమీన్‌పూర్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. పటేల్ గూడ ప్రాంతంలో అనుమతులకు మించి ఇష్టారాజ్యంగా నిర్మించిన అక్రమ అదనపు అంతస్తులను జీహెచ్ఎంసీ ప్లానింగ్ అధికారులు మంగళవారం జేసీబీలతో నేలమట్టం చేశారు. హెచ్చరించినా మారని బిల్డర్ల తీరు: గతంలోనే నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన ప్లానింగ్ విభాగం, అదనపు అంతస్తులను సీజ్ చేసి పనులు నిలిపివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే అధికారుల హెచ్చరికలను ఏమాత్రం ఖాతరు చేయని కొందరు బిల్డర్లు, సీజ్‌లను సైతం లెక్కచేయకుండా యథేచ్ఛగా నిర్మాణ పనులను కొనసాగించారు. ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అమీన్‌పూర్ ప్లానింగ్ ఏసీపీ ప్రసాద్, ప్రత్యేక బృందంతో రంగంలోకి దిగి అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఊరుకునేది లేదు: ఏసీపీ ప్రసాద్ హెచ్చరిక" జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకున్న మేరకే నిర్మాణాలు చేపట్టాలి. అనుమతులు లేకుండా, సీజ్ చేసిన తర్వాత కూడా ఇష్టారాజ్యంగా పనులు కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవు. నిబంధనలు ఉల్లంఘించిన బిల్డర్లపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగింది. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాలకు తావులేదు; ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు. బిల్డర్లలో గుబులు: అక్రమ నిర్మాణాలపై ఏసీపీ ప్రసాద్ నేతృత్వంలో చేపట్టిన ఈ మెరుపు కూల్చివేత చర్యలతో స్థానిక అక్రమ నిర్మాణదారుల్లో గుబులు మొదలైంది. అనుమతి పత్రాలు సరిగా లేకుండా ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దని, బిల్డర్లు సైతం పరిమితులకు లోబడే నిర్మాణాలు చేపట్టాలని అధికారులు స్పష్టం చేశారు.

# పట్టా భూములను 22-ఏ లో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గం

**-కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ఆగ్రహం**

**-22- ఏ నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్; భారీ ఎత్తున ధర్నాకు పిలుపు**

**అమీన్‌పూర్, ఆగస్టు 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

ప్రభుత్వ భూములు ప్రభుత్వానికి, పట్టా భూములు ప్రజలకు చెందాలని హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కావాలనే ఉద్దేశపూర్వకంగా పట్టా భూములను సైతం 22- ఏ నిషేధిత జాబితాలో చేర్చి సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమీన్‌పూర్‌లో గత 30 ఏళ్ల క్రితం వేసిన హెచ్ఎండిఏ లేఅవుట్ భూములతో పాటు ఇతర నివాస ప్రాంతాలను 22- ఏ లో చేర్చడం అత్యంత దారుణమన్నారు. అప్పట్లో హెచ్ఎంటీ ఉద్యోగులు కష్టపడి ప్లాట్లు కొనుగోలు చేస్తే, ఇప్పుడు రిజిస్ట్రేషన్ల కోసం సీసీఎల్ఏ కార్యాలయానికి వెళ్తే అవి 22-ఏ లో ఉన్నాయని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.



దీనికోసం కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలంటూ సామాన్య ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుతూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమీన్‌పూర్ పరిధిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు జీవితాంతం 20 నుండి 30 ఏళ్లు కష్టపడి ఒక ఇల్లు కట్టుకుంటే, అత్యవసర సమయాల్లో వాటిని అమ్ముకుందామన్నా 22-ఏ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచిత్రంగా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ ఉన్న హెచ్ఎంటీ లేఅవుట్ స్థలాన్ని, ఇక్రిశాట్ పక్కన ఉన్న లేఅవుట్లను, పటేల్‌గూడలోని పీపీహెచ్ కాలనీ లేఅవుట్‌లను కూడా 22-ఏ లో పెట్టడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. పీపీహెచ్ కాలనీలో గతంలో హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చిందని, అక్కడ అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇప్పటికే 24 ప్లాట్లలో 20 ప్లాట్లు రిజిస్ట్రేషన్లు పూర్తయినా, మిగిలిన వాటిని ఇప్పుడు 22-ఏ లో పెట్టి ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. అధికారుల వద్ద, ప్రభుత్వ రికార్డుల్లో ఏది పట్టా భూమి, ఏది ప్రభుత్వ భూమి అనే స్పష్టమైన వివరాలు ఉన్నప్పటికీ, ప్రజలను మళ్లీ దరఖాస్తులు చేసుకోమనడం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజలను క్షోభకు గురిచేస్తున్న 22-ఏ నిషేధాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై పెద్ద ఎత్తున అమీన్‌పూర్ నుంచి ధర్నా చేపట్టి ప్రజా పోరాటాన్ని ఉధృతం చేస్తామని, బాధిత ప్రజలందరికీ అండగా ఉంటామని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ స్పష్టం చేశారు.

# ఆర్బీఐ కేంద్ర బోర్డులో అనధికార డైరెక్టర్ గా సయ్యద్ అక్బరుద్దీన్ నియామకం

**- హర్షం వెలిబుచ్చిన గీతం యాజమాన్యం, సంతోషాన్ని వ్యక్తపరిచిన కౌటిల్యా అధ్యాపకులు**

**పటాన్ చెరు, ఆగస్టు 25:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్, ఐక్యరాజ్య సమితిలో భారత మాజీ రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర బోర్డులో పార్ట్-టైమ్, అనధికారిక డైరెక్టర్ గా నియమితులయ్యారు. నాలుగేళ్ల కాల పరిమతి గల ఈ నియామక ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయి.. భారత ప్రభుత్వానికి క్యాబినెట్ నియామకాల కమిటీ సచివాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, సిబ్బంది-శిక్షణ విభాగం అండర్ సెక్రటరీ కుందన్ నాథ్ ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను వెలువరించారు. సయ్యద్ అక్బరుద్దీన్ తో పాటు, యానీ జార్జ్ మాథ్యూ, జనమేజయ కుమార్ సిన్హా కూడా ఆర్బీఐ కేంద్ర బోర్డులో పార్ట్-టైమ్ అనధికారిక డైరెక్టర్లుగా నియమితులయ్యారు. దౌత్యవేత్త అక్బరుద్దీన్ నియామకం పట్ల గీతం నాయకత్వం, కౌటిల్యా అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కొత్త బాధ్యతలపై ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సయ్యద్ అక్బరుద్దీన్ గురించి: సయ్యద్ అక్బరుద్దీన్ మూడు దశాబ్దాలకు పైగా వృత్తి జీవితాన్ని గడిపిన, 1985 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ కు చెందిన ఒక విశిష్ట భారతీయ దౌత్యవేత్త. ఆయన, జనవరి 2016 నుంచి ఏప్రిల్ 2020 వరకు న్యూయార్క్ లోని ఐక్యరాజ్య సమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధిగా పనిచేశారు. అంతకు ముందు, జనవరి 2012 నుంచి ఏప్రిల్ 2015 వరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. అలాగే, 2006 నుంచి 2011 వరకు వియన్నాలోని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)లో విదేశీ సంబంధాలు, విధాన సమన్వయ విభాగాధిపతిగా పనిచేశారు. తన దౌత్య వృత్తి జీవితంలో, అక్బరుద్దీన్ స్వదేశంలోనూ, విదేశాలలోనూ అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. కైరో, రియాద్, జెడ్డా నగరాలలో పనిచేయడం ద్వారా పశ్చిమ ఆసియా వ్యవహారాలపై ఆయన గణనీయమైన నైపుణ్యాన్ని సంపాదించారు. విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి కార్యాలయంలో డైరెక్టర్ గా పనిచేయడంతో పాటు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో బాహ్య ప్రచారం, ప్రజా దౌత్య విభాగానికి నాయకత్వం వహించడం వంటి ఉన్నత బాధ్యతలను కూడా ఆయన చేపట్టారు. 2015లో జరిగిన భారత్-ఆఫ్రికా శిఖరాగ్ర సమావేశానికి ఆయన ముఖ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. ఐక్యరాజ్య సమితి లో భారతదేశ శాశ్వత ప్రతినిధిగా, అక్బరుద్దీన్ బహుపాక్షిక వేదికలపై భారతదేశ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన సమర్థవంతమైన దౌత్యపరమైన కృషికి విస్తృతంగా గుర్తింపు పొందారు. ఆయన పదవీ కాలంలో ఉగ్రవాద నిరోధం, వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి, అంతర్జాతీయ శాంతి భద్రతలు వంటి అంశాలకు గణనీయమైన తోడ్పాటు అందించారు. గీతంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్ గా, అక్బరుద్దీన్ ప్రజా విధాన విద్యకు, భారతదేశంలో, వెలుపల భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దడంలో తనవంతు కృషిని కొనసాగిస్తున్నారు.



# 22 ఏ భూముల బాధితులకు అండగా గులాబీ దళం

- ఆగస్టు 29న అమీన్పూర్ వేదికగా పోరుబాట..
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు రాక..

15 వేల మందితో భారీ నిరసన సభ





**పటాన్ చెరు, ఆగస్టు 25:( మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** పటాన్చెరు నియోజకవర్గంలో 22 ఏ నిషేధిత జాబితాలో చేరిన భూములు, ఫ్లాట్స్, ప్లాట్ల బాధితులకు అండగా నిలిచేందుకు గులాబీ దళం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టనుంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 29న పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్పూర్ వేదికగా భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మంగళవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో నియోజకవర్గం పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులతో నిరసన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..22 ఏ భూముల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయనస్పష్టం చేశారు. రెక్కల కష్టంతో పైసా పైసా కూడబెట్టుకొని ఇల్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసిన పేద మధ్యతరగతి బతుకులను 22 ఏ నిషేధిత భూముల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రోడ్డు మీదకు తీసుకుని వచ్చిందని వాపోయారు. నియోజకవర్గం వ్యాప్తంగా 22 ఏ జాబితా కారణంగా భూముల విక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు అండగా బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందని తెలిపారు. భూమి అనేది ప్రతి కుటుంబానికి అత్యంత విలువైన ఆస్తి అని, సంవత్సరాలుగా తమ భూములను సాగు చేసుకుంటూ, ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్న అనేక కుటుంబాలు 22 ఏ జాబితా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట శాసనసభ్యులు శ్రీ తన్నీరు హరీష్ రావు గారి ఆదేశాల మేరకు.. ఈ నెల 29, శనివారం అమీన్పూర్ వేదికగా భారీ నిరసన కార్యక్రమం చేపట్టబోతున్నట్లు ఆయన తెలిపారు. సుమారు 15 వేల మంది నిరసన సభకు హాజరు కానున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ పోరాటాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. నిరసన సభను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, 22 ఏ భూముల బాధితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ యన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ కో ఆర్డి నేటర్ ఆదర్శ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ పరిస్థితులు, నీట్ పీజీ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్లతో సీఎస్ సమీక్ష



**హైదరాబాద్, ఆగస్టు 25:** రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, ప్రజలకు అవసరమైన సేవలు, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయా అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్ట ర్లను ఆయన అడిగి తెలుసుకు న్నారు. సీజనల్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని వారికి సీఎస్ సూచించారు. వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంట నే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఇక నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ ప్రత్యేకంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశు ధ్యం, రవాణా తదితరత అంశాలపై అధికారు లతో చేయాలని సూచించారు. ఈ ప్రవేశపరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# యూరియా కోసం అష్టకష్టాలు



**సిద్దిపేట:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఎరువుల యాప్తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా స్టాక్ వివరాలు ఈ-య్ష?పలో అప్లోడ్ చేసిన 5 నుంచి 10 నిమిషాల్లోనే స్టాక్ అయిపోతోంది. వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలు సాగు చేయాలని అధికారులు అవగాహన కల్పించడంతో కొంతవరకు వరి సాగు తగ్గింది. అయినప్పటికీ సిద్దిపేట డివిజన్ పరిధిలో యూరియా డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. డిమాండ్కు తగినట్లుగా యూరియా సరఫరా చేయాలని అధికారులు నివేదికలు పంపినప్పటికీ, యాప్లోనే బుక్ చేసుకోవాలనే నిబంధన రైతులకు శాపంగా మారింది. సిద్దిపేట వ్యవసాయ డివిజన్ పరిధిలో గతేడాది వరి సాగు 86 వేల ఎకరాలు కాగా, ఈ వానకాలంలో 73 వేల ఎకరాలకు పడిపోయింది. ఆ స్థానంలో కంది, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటలు సాగయ్యాయి. ఈ వానకాలం సీజన్కు 12వేల మెట్రిక్ టన్నుల యూరియా డిమాండ్ ఉండగా, నేటి వరకు కేవలం 4,500 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయింది. మరోవైపు యాప్లో సర్వర్ డౌన్ కావడం, ఓటీపీలు సకాలంగా రాకపోవడం, స్టాక్ అయిపోయినా అదనంగా బుకింగ్ కావడంతో గందరగోళం నెలకొంటున్నది.

# మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు.



**హైదరాబాద్, ఆగస్టు 25:** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సీఐ ముత్తు యాదవ్పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో అలసత్వం వహించడంతో పాటు.. కేసు నమోదైన తర్వాత నిందితుడిని అదుపులోకి తీసుకునే విషయంలోనూ నిర్లక్ష్యంగా వహించారనే ఆరోపణలపై పోలీస్ ఉన్నతాధికారులు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే సీఐ ముత్తు యాదవ్ కేవలం 3 వారాల క్రితమే జూబ్లీహిల్స్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలోనే బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే ఇలా సస్పెన్షన్కు గురికావడం పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయా ంశంగా మారింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్లోని సుమంత్ ఆఫీసుకు గత నెల 30వ తేదీన చెంగిచెర్లకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణను డబ్బు వ్యవహారంపై మాట్లాడేందుకు పిలిపించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ సుమంత్తో పాటు అతని అనుచరులు ప్రశాంత్, అరుణ్ కుమార్రెడ్డి, కార్తీక్, మహేందర్రెడ్డి, రాము సహా పలువురు వ్యక్తులు హరికృష్ణపై ఇనుప రాడ్తో దాడి చేసినట్లు ఫిర్యాదు నమోదైంది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన హరికృష్ణ.. చెంగిచెర్ల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. ఆ తర్వాత ఆ కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్కు ట్రాన్స్ఫర్ చేశారు. అయితే ఈ వ్యవహారం బయటకు రావడంతో సుమంత్ తన ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి పరారైనట్లు పోలీసు లు చెబు తున్నారు. ప్రస్తుతం ఆయన కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. పోలీస్ స్టేషన్లకి జేసీ స్టేషన్ అని పేరు పెట్టండి: కేతిరెడ్డి పెద్దారెడ్డి మంత్ను పట్టుకునేందుకు జూబ్లీహిల్స్ పోలీసు లు ఇప్పటికే మూడు ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేశారు. టాస్క్ఫోర్స్ పోలీసులు కూడా మరో బృందంతో గాలింపు చేపట్టినట్లు తెలు స్తోంది. ఇప్పటికే ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేశారు. సుమంత్ డ్రైవర్ నవీన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సుమంత్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు, నిందితుడి అరెస్టు విషయంలో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు సమీక్షించిన తర్వాత సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారని పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# మైనారిటీ వర్గాల కోసం తాజుద్దీన్ చేసిన సేవలు మరువలేనివి



**హైదరాబాద్, ఆగస్టు 25:** బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షుడు తాజుద్దీన్ అకాల మరణం పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఖమ్మం నగరంలో తాజుద్దీన్ పార్థివదేహాన్ని పువ్వాడ అజయ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా తాజుద్దీన్తో తనకున్న అనుబంధాన్ని, పార్టీకి, మైనారిటీ వర్గాల కోసం ఆయన అందించిన సేవలను పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేసుకున్నారు. తాజుద్దీన్ మృతి పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటని, ఆయన లేని లోటును ఎవరూ పూడ్చలేరని అన్నారు. తాజుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని అజయ్ కుమార్ ఆకాంక్షించారు.

# నషా ముక్త్ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం



**నిజామాబాద్, ఆగస్టు 25 :** నషా ముక్త్ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వ్యాఖ్యానించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, విద్యా క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రజా ఉద్య మంగా రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో (మంగళవారం) నషా ముక్త్ భారత్ అభియాన్పై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, రాకేశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, పోలీసు కమిషనర్ సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నషా ముక్త్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.

# ప్రతి మొక్కను సంరక్షించాలి.



**హైదరాబాద్, ఆగస్టు 25 :** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క (ంవశ్రీఖఅస్త్రుఖఖ వీఱఅఱర్వతీ ూవవ్ష్టుఎఖ) సంబంధిత అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈరోజు (మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు ఇచ్చిన టార్గెట్లో 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు. మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చీవీమీ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశం చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశించారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..